**దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్**
**దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావు పుట్టుకల్**
**మోహ నిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబు జూడ యా**
**దేహియె దేవదేవుడు మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ**

దేహమనేది ఒక గోద్రెజ్ బీరువావంటిది. దీనిని దేని నిమిత్తమై తీసుకున్నాము? విలువలేని ఇనుపపెట్టెలో విలువైన నగలను భద్రంగా దాచుకుంటాము. ఇందులో చాలా విలువైనటువంటి వస్తువులున్నవి. సత్యమే విలువైనటువంటి ఒక గొప్ప నగ. ధర్మమనేది వజ్రాలు పొదిగిన మరో బంగారునగ వంటిది. సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ ఇవే మానవునియందున్న అత్యంత విలువైన నగలు. ప్రతి మానవునికి శాంతి అత్యవసరము. ఏ కోటీశ్వరుణ్ణి అడిగినా, 'స్వామీ, సర్వమూ మాకున్నది. కాని, శాంతి లేదు', అంటారు. శాంతి లేకుండా మనకు సౌఖ్యము కలుగదు. నాలుగవది ప్రేమ. ఈ ఐదింటినీ అభివృద్ధిపరచు కున్నప్పుడే మానవుడు సర్వసంగ పరిత్యాగి కాగలడు. త్యాగి అనగా ఎవరు? వాంఛలయొక్క ఫలమును వీడుటయే త్యాగము. అట్టి త్యాగమువల్లనే శాంతి లభిస్తుంది. కోరికలున్నంతకాలము శాంతిని పొందలేము.

**సత్య ధర్మ ప్రేమ శాంతులు లేకున్న**
**విద్యలన్నియు నేర్చిన విలువ సున్న**
**సత్య ధర్మ ప్రేమ శాంతులు లేకున్న**
**దాన ధర్మాల సార్థకత సున్న**
**సత్య ధర్మ ప్రేమ శాంతులు లేకున్న**
**పదవుల నేలిన ఫలము సున్న**
**సత్య ధర్మ ప్రేమ శాంతులు లేకున్న**
**బహుళ సత్కార్య లాభంబు సున్న**
**ఈ సనాతన ధర్మ హర్మ్యంబు నిలుప**
**గుణము లియ్యవి నాల్గు పునాదిగోడలప్ప**
**ఇంతకన్నను వేరెద్ది ఎఱుకపరతు?**
**సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులార!**

ప్రతి మానవుడు సత్యము, ధర్మము, శాంతి, ప్రేమలనే బంగారు నగలను లోపల ఉంచుకున్నాడు. నగలు లేకుండా ఖాళీ ఇనుప పెట్టెను తెచ్చి ఇంట్లో పెట్టుకుంటే దానికి ఏమాత్రము విలువ లేదు. అందులో విలువైన నగలను పెట్టుకున్నప్పుడే ఆ పెట్టెకుకూడా విలువ ఉంటుంది. లోపల బంగారు నగలున్నప్పుడే ఇనుపపెట్టెకు విలువ. ఖాళీ ఇనుపపెట్టెను ఎక్కడ పడేసినా ఎవ్వరూ దానిని ఆశించరు. అదేవిధంగా తనలో ఉన్న మానవతా విలువలను కాపాడుకోలేని వ్యక్తిని ఎవ్వరూ గౌరవించరు. కాబట్టి, తనలో ఉన్న మానవతా విలువలనే నగలను కాపాడుకోవడమే మానవుని ప్రధాన కర్తవ్యం. సత్యము ఎన్నటికీ మారునటువంటిది కాదు. అది శాశ్వతమైనది. ప్రతి మానవునికి సత్యమేమిటో తెలుసు. కాని, తెలిసికూడను తాను దానిని వదలిపెడుతున్నాడు. కష్టాలనుండి తప్పించుకునే నిమిత్తమై అసత్యానికి పాల్పడుతున్నాడు.

రెండవది ధర్మము. "సత్యాన్నాస్తి పరో ధర్మః" అన్నారు. ఎంతటి పెద్ద భవనమును కట్టినప్పటికీ దానికి

మొట్టమొదట పునాది వేయాలి. పునాది భద్రంగా లేకపోతే గోడలు నిలువవు. ధర్మమే జీవితసౌధానికి పునాది. లోకంలో రెండు రకములైన ధర్మము లుంటున్నవి. ఒకటి లౌకిక ధర్మము, రెండవది ఆధ్యాత్మిక ధర్మము. మనం భౌతికమైన జీవితంతో ధర్మాన్ని అనుభవిస్తున్నాము. ఇది నిరంతరము కదిలేటటువంటిదే. కాని, ఆధ్యాత్మిక ధర్మము ఎప్పటికీ కదిలేటటువంటిది కాదు. పునాది ఏమైనా కదిలెనా, గోడలు కూలిపోతాయి. ధర్మమనేది మనము జీవితమంతా నడుచుకోవలసినది. శాంతియే జీవితములో వెలుగును నింపునది. శాంతి లేని మానవుడు చీకటింటిలో జీవితాన్ని గడుపుతున్నవానితో సమానుడు. చీకటిలో నివసించే వాడు ఎట్టి ప్రమాదములకైనా గురి అయ్యే అవకాశం ఉంది. ప్రేమ అనేది అత్యంత ప్రకాశవంతమైనది. తల్లి కుమారుణ్ణి ప్రేమిస్తుంది, కుమారుడుకూడను తల్లిని ప్రేమిస్తాడు. తల్లీబిడ్డల మధ్య ఉన్న సన్నిహిత సంబంధము ఎవ్వరూ వర్ణించలేరు.

ఒకానొక సమయంలో రంగూన్ యుద్ధం జరిగినప్పుడు ఒక తల్లి, ఆమె కుమారుడు ఇరువురూ అక్కడినుండి తప్పించుకొని మద్రాసు స్టేషనుకు చేరుకున్నారు. అప్పటినుండి వాళ్లకి కష్టాలు ప్రారంభమయ్యాయి. తల్లి ఇల్లిల్లూ తిరిగి భిక్షమెత్తేది. తనకు చిక్కింది కుమారునికి పెట్టేది. మిగిలితే తాను తినేది, లేకపోతే పస్తుండేది. ఈ సంగతి కుమారునికి తెలియదు. తాను తిని హాయిగా నిద్రపోయేవాడు. ఈవిధంగా కొన్ని రోజులు జరిగేసరికి తల్లి చాలా బలహీనమైపోయింది. “అమ్మా! నీవు చాలా బక్కపడి పోయినావే! నీవు సరిగా భోజనం చేయట్లేదు. నీకు చిక్కిన కాస్త అన్నం నాకు పెట్టి నీవు పస్తుంటున్నావు. ఇక నీవు ఇంట్లో ఉండు. నేను వెళ్లి భిక్షమెత్తి తెచ్చి నీకు పెడతాను”, అన్నాడు. ఆనాటినుండి కుమారుడు భిక్షాటనకు బయలుదేరాడు. ప్రతి రోజు భిక్షమెత్తి తల్లిని పోషిస్తూ వచ్చాడు. ఈరీతిగా కొన్ని రోజులు గడిచేసరికి పిల్లవాడు చాలా బలహీనుడైపోయాడు. ఒకనాడు ఒక ఇంటి ముందు నిలబడి, ‘అమ్మా, నాకు చాలా ఆకలిగా ఉన్నది. కాస్త భిక్షమెయ్యండి తల్లీ’ అని అన్నాడు. ఆ ఇంటి యజమాని వరండాలో ఈజీ ఛైర్‌లో కూర్చుని పేపరు చదువుతున్నాడు. ఆయన ఈ పిల్లవానిని చూసి జాలిపడి, ఇంట్లోకి వెళ్ళి ఒక తట్టలో ఇంత అన్నం, సాంబారు తీసుకు వచ్చి, “నాయనా! నీవు చాలా నీరసంగా కనిపిస్తున్నావు. ఇక్కడే కూర్చుని తిను”, అన్నాడు. అప్పుడా పిల్లవాడు ‘నేనిక్కడ తినను. ఇంటికి తీసుకువెళ్ళి మొదట అమ్మకు పెట్టి తింటాను”, అన్నాడు. ఆయనకు కోపం వచ్చింది. ‘నీకు నిజంగా ఆకలిగా ఉంటే ఇక్కడే కూర్చుని తినవచ్చు కదా’, అన్నాడు. ఇంతలో ఈ పిల్లవాడు నీరసంతో కళ్లు తిరిగి పడిపోయాడు. పడిపోయి ఏదో చెప్పడానికి ప్రయత్నిస్తున్నాడు. ఆయన పిల్లవాని దగ్గరకు వెళ్ళి నోటిదగ్గర చెవి పెట్టి అతనంటున్న మాటలు విన్నాడు. “మొదలు అమ్మకు, మొదలు అమ్మకు... ’ అంటూ ఆ పిల్లవాడు ప్రాణం విడిచాడు. తల్లిపైన ఆ బిడ్డకు ఎంత ప్రేమయో కుమారుడంటే ఆ తల్లికికూడను అంత ప్రేమ. కుమారుని మరణవార్త వింటూనే ఆమెకూడా ప్రాణం విడిచింది. ఈవిధంగా తల్లీ బిడ్డలు ఒకరికోసం ఒకరు ప్రాణం విడిచారు. తల్లి ప్రేమ బిడ్డపైన, బిడ్డ ప్రేమ తల్లిపైన అన్యోన్యమైన రీతిగా అభివృద్ధి కావాలి. ప్రాచీన కాలమునుండి ఇటువంటి ఆదర్శ మూర్తులైన తల్లీబిడ్డలు ఎందరో భారతదేశంలో జన్మించారు. కాని, ఈనాడు తల్లిపట్ల కుమారునికి ప్రేమ అభివృద్ధి కావడం లేదు. ఇప్పుడంతా స్వార్థం, స్వార్థం, స్వార్థం! ప్రేమయే లేకుండిన ప్రాణమే లేనట్లు. ప్రేమయే ప్రాణము. తల్లిని ప్రేమించాలి. తల్లీ బిడ్డల మధ్య అన్యోన్య ప్రేమ అభివృద్ధి కావాలి. అది లేకుండిన ప్రాణమే లేదు. అటువంటి జీవితము జీవితమే కాదు. ప్రేమ ఉన్నప్పుడే మనకు శాంతి, సంతృప్తి లభిస్తాయి. శాంతి ఉన్నచోటే అహింస ఉంటుంది. ‘అహింసా పరమో ధర్మః’ అని ప్రవచించాడు, బుద్ధుడు. సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ, అహింస ఈ ‘పంచ ప్రాణములూ’ మానవుని పంచేంద్రియాలలోనే ఇమిడియున్నవి. ఈ ఐదూ గలవాడే నిజమైన మానవుడు. ఈ ఐదింటినీ రక్షించుకునే నిమిత్తమై మనము ఇన్ని రకములైన యజ్ఞయాగాది క్రతువులు, జపతపాది పవిత్ర కర్మలను ఆచరిస్తున్నాము. కర్మల నాచరించడం ఎందుకోసం? చిత్తశుద్ధి కోసమే! ఇటువంటి పవిత్రమైన భావములు ఏ

మానవునియందు ఉండునో వాడే ధన్యుడు, వాడే పుణ్యుడు. ఈ పంచ ప్రాణములలో ఏ ఒక్కటి లేకపోయినను తన జీవితము వ్యర్థమే! కనుక, మానవుడు మొట్టమొదట సత్యముతో బ్రతకాలి. ధర్మముతో పెరగాలి. సత్యము పునాదివంటిది. ధర్మము గోడవంటిది. పునాది లేకపోతే గోడ నిలువదు. ప్రేమ పైకప్పు వంటిది. శాంతి అనేదే ఆ 'రూఫ్' (పైకప్పు) క్రింద ఉండే 'లైఫ్' (జీవితము). 'రూఫ్' లేని ఇంటిలో మానవుడు నివాసము చేయలేడు. ఈనాడు సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలు పూర్తిగా క్షీణించిపోయినాయి. ఎంత ధనవంతునికైనా త్యాగభావము పుట్టటం లేదు. అటువంటివాని జీవితము కేవలం పైకప్పు లేని ఇల్లువంటిది. వాడు నిరంతరము ఎండకు ఎండవలసిందే, వానకు తడవవలసిందే! కాబట్టి, మనము 'రూఫ్'ను భద్రంగా చూసుకోవాలి.

ప్రేమస్వరూపులారా! మీరందరుకూడను సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలను పెంచుకోవాలి. ఈ ఐదూ లేనప్పుడు మానవత్వమే వ్యర్థమైపోతుంది. ఈనాడు ఎక్కడికి పోయినప్పటికీ ధనము, ధనము, ధనము! దోసెలు పోసే ముసలమ్మకూడను బాగా ధనం సంపాదించాలని ఆశిస్తుంది. ఇలాంటి ఆశలు ఈనాడు అమితంగా పెరిగిపోయినవి. ఇది కలియుగము కాదు, కలహయుగము! ఈ కలహమునకు మూలకారణం ధనమే! కాబట్టి, మొట్టమొదట ఆశలను తగ్గించుకోవాలి. మనము దేహమును ప్రధానంగా తీసుకుంటున్నాము. దేహమును ఒక 'పెట్టె'వలె చూసుకోవాలి. ఇందులో ఉన్న విలువైన 'ఆభరణములను' భద్రంగా కాపాడుకోవాలి. అవి లేనప్పుడు ఈ 'పెట్టె' ఏమాత్రము పనికిరాదు. మానవ జీవితము చాలా విలువైనది. ఈ సత్యాన్ని గుర్తించి వర్తించాలి. 'మానవతా విలువలను' కోల్పోయి జీవితాన్ని విలువలేనిదిగా మార్చుకుంటే ఏమి ప్రయోజనం! పశు, పక్షి, మృగాదులయందుకూడా ప్రేమ ఉన్నది. వాటికి మానవునివలె ఆశలు లేవు. ఆకలైనప్పుడు ఏదో ఇంత భుజిస్తాయి. కాని, మానవుడట్లు కాదు. అన్నీ కావాలి వాడికి. ఐదు బిల్డింగులున్నప్పటికీ 'నాకింకా పది బిల్డింగులు కావాలి' అని ఆశిస్తుంటాడు. తాను నివసించడానికి ఒక ఇల్లు చాలదా? అన్ని బిల్డింగులెందుకు?! ఈవిధమైన ఆశలు పెరగడంచేతనే మోసము జరుగుతుండాది. Too much desires! ఈ కోరికలను తగ్గించుకోవాలి. Less luggage, more comfort makes travel a pleasure. మేము ఎన్నో చేస్తున్నాము. కాని, దేనికీ ప్రతిఫలం ఆశించడం లేదు. నాకు ఒక ఇల్లుకూడా లేదు. నేనెక్కడికి వెళ్లినా భక్తుల ఇళ్లలో నివసిస్తుంటాను, తరువాత అక్కడినుండి వెళ్లిపోతాను. ఈవిధంగా మీరుకూడా ఎలాంటి కోరికలూ లేకుండా ఉండాలి. మానవులై జన్మించినందుకు మీరు కోరికలపై అదుపు సాధించాలి. కోరికలను అరికట్టుకున్నప్పుడు మీరు ఎంతైనా శాంతిని అనుభవించగలరు. దైవంపట్ల మీ ప్రేమ ఎలాంటి పరిస్థితిలోనూ చలించకూడదు. దైవప్రేమను పెంచుకోవాలి. ఆ ప్రేమను పెంచుకుంటే అన్నీ మనకు సిద్ధిస్తాయి.

ప్రేమస్వరూపులారా! అనేకమంది పెద్దల ప్రసంగాలను మీరు వింటున్నారు. విన్నవన్నీ మీరు ఆచరణలో పెట్టాలి. సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలను శాశ్వతంగా నిలుపుకోవాలి. శాంతి, ప్రేమ ఈ రెండూ ఉంటే ఎంతైనా మనము సాధించవచ్చును. ఇక్కడ ముందు లైన్లో కూర్చున్నటువంటి పిల్లలు పిహెచ్.డి. చేశారు. ఇటువైపు కూర్చున్న పిల్లలు పోస్టు గ్రాడ్యుయేషన్ చేశారు. వీళ్లలో ఒక్కడికైనను ఇంటి ఆశ లేదు. వీళ్ళు ఎక్కడికి పోయినా వేలాది రూపాయలు జీతమిస్తారు. బయట ఎమ్.బి.ఎ. పిల్లలు లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. కాని, వీళ్లకి డబ్బుమీద ఆశ లేదు. 'డబ్బు మాకేమైనా ఆనందమిస్తుందా? లేదు. మాకు 'వర్క్' (పని) కావాలి. Work is worship. Duty is God. కాబట్టి, మాకు డ్యూటీ కావాలి', అంటారు వీళ్ళు. ఈవిధంగా పిల్లలందరిలో ఆదర్శవంతమైన భావాలు కలగాలి. కాని, ఈనాడు లోకములో ఎక్కడ చూసినా కోరికలు, కోరికలు! ఈ కోరికలు ఏమి చేస్తున్నాయి? మానవుణ్ణి దుఃఖంలో ముంచుతున్నాయి. Control your desires. ఆశలను తగ్గించు కుంటూ రావాలి. నెత్తిపైన భారము పెట్టుకొని ఎంత కాలము నీవు నడువగలవు? నీవిప్పుడు ఒంటరిగా ఉన్నావనుకో.

ఎంత హాయిగానో ఉండవచ్చు నీవు. నీవు పెండ్లి చేసుకున్నావు. భార్య వచ్చింది. నాల్గు కాళ్ళు అయినాయిప్పుడు. ఎక్కడికైనా బయటికి వెళ్ళాలంటే 'అయ్యో, ఇంటిదగ్గర ఎవరూ ఉండరే', అని ఒక వర్రీ వస్తుంది. ఒక సంవత్సరం అయిన తరువాత కుమారుడు పుడతాడు. అప్పుడు ఆరు కాళ్లవుతాయి. ఈవిధంగా కాళ్ల సంఖ్య పెరిగేకొలదీ మన నడక వేగం మందగిస్తుంది. నీ జీవిత ప్రయాణం కుంటుపడుతుంది. కనుక, ప్రేమస్వరూపులారా! ప్రేమను పెంచుకోండి. సర్వులను ప్రేమించండి. కాని, ఈవిధమైన బాధ్యతలు మాత్రం నెత్తిపై వేసుకోకూడదు. ఇట్టి బాధ్యతలు తగిలించుకుంటే చాలా కష్టమైపోతుంది. మీలో చాలామందికి ఈవిషయం అనుభవమే. భారం తగ్గించుకుంటే హాయిగా మనము జీవించవచ్చు. ఏమాత్రము దుఃఖము, కష్టము ఉండదు. దక్షిణామూర్తి సందేశముకూడా ఇదే. ఆయన ప్రధానంగా త్యాగమును బోధించాడు. ఆయనది కేవలం మౌనవ్యాఖ్యానం. మౌనంగా ఉంటాడు. ఆయన మోముపై నిరంతరము చిరునవ్వులు నాట్యమాడుతూ ఉండేవి. ఆవిధంగా ఆనందస్వరూపుడై ఉండడానికి కారణమేమిటి? ఆయన ఈవిధమైన బాధ్యతలు తగిలించుకోలేదు.

రంగూన్ నుండి వచ్చిన ఆ తల్లీబిడ్డలిరువురూ ప్రేమకోసం ప్రాణాలు త్యాగం చేశారు. చచ్చినా ఫరవాలేదుగాని, మనము ప్రేమను మాత్రం వదలకూడదు. ఏనాటికైనా చావు తప్పింది కాదు. ఈనాడు ఈ దేహమును చక్కగా పోషించుకున్నను రేపటి దినము దీనిని వదలిపెట్టక తప్పదు. కాబట్టి, మనము దేహాభిమానమును విడిచిపెట్టాలి. మంచిపేరు తెచ్చుకోవాలి. మంచిపేరే నిజమైన ప్రాణము. మనిషి మరణించినా ఆ పేరు మాత్రం శాశ్వతంగా నిలుస్తుంది. సమాజములో గొప్పపేరు తెచ్చుకోవడంలో గొప్పతనం లేదు. మంచిపేరు తెచ్చుకోవాలి. 'ఆయన కోటీశ్వరుడురా' అని ప్రజలు మిమ్మల్ని గొప్పవారుగా భావించవచ్చు. కాని, ఏమి ప్రయోజనం? "కోటీశ్వరుడైన కూడుగుడ్డయెగాని మెరుగు బంగారంబు మ్రింగబోడు." కాబట్టి, ఉన్నంతవరకు మనము సుఖ శాంతులతో జీవించాలి. సమాజాన్ని సుఖపెట్టాలి. ప్రాపంచిక సంబంధాలను తగ్గించుకోవాలి. అందరి యందుకూడను ప్రేమ చూపాలి. 'నా భార్యాపిల్లల్ని మాత్రమే నేను ప్రేమిస్తాను', అన్న స్వార్థభావం మంచిది కాదు. Fish is better than selfish. చేప జలంలో ఆనందంగా సంచరిస్తూ ఉంటుంది. అది ఎట్టి బాధ్యతలనూ, ఎట్టి భారమునూ నెత్తిపైన వేసుకోదు. కాని, ఈనాటి మానవుడు చచ్చేంతవరకు భారమును తీసుకుంటూనే ఉంటాడు. ఆ 'హెవీ లోడ్'వల్లనే తాను క్రుంగిపోతున్నాడు. కనుక, బాధ్యతలను తగ్గించుకొని, దైవచింతనను పెంచుకోవాలి. పరమాత్మునియొక్క ప్రేమను పెంచుకున్నప్పుడే ప్రకృతియొక్క ఆనందాన్ని మనము అనుభవించవచ్చు. Duty is God. Work is worship (కర్తవ్య నిర్వహణయే దైవారాధన. పనియే పూజ) అనే భావంతో జీవించాలి. బాధ్యతలను ఎక్కువగా పెంచుకోకూడదు. అందరినీ చూసుకునేవాడు భగవంతుడే అన్న ధైర్యంతో, విశ్వాసంతో జీవించాలి. అన్నింటినీ చూసుకునే భగవంతుడు మన ఇంట, వెంట, జంట ఉండగా మనమెందుకిన్ని బాధలకు గురి కావాలి?! ఈవిధంగా అనుకుంటాము మనము. కాని, చింత చేస్తూనే ఉంటాము. అట్లా ఉండకూడదు. అన్నీ భగవంతునికి అర్పితం చేసుకున్నప్పుడు మనము ఎలాంటి చింతలూ లేకుండా 'ఫ్రీ'గా ఉండాలి. అప్పుడే మనము శాంతిని పొందుతాము. ఎన్ని యజ్ఞ యాగాది క్రతువులు ఆచరించినప్పటికీ వాటి అంతరార్థమును మనము గుర్తించి వర్తించకపోతే ప్రయోజనం లేదు. ప్రపంచాన్ని మరువవచ్చుగాని, దైవాన్ని మరువకూడదు. భగవంతుణ్ణి నిరంతరము మనస్సులో పెట్టుకొని జీవితాన్ని గడపాలి. ఇదే నేనీనాడు మీకు ముఖ్యంగా చేసేటటువంటి ప్రబోధ.

(అతిరుద్రమహాయజ్ఞ సందర్భంగా 2006 ఆగష్టు 12వ తేదీ భగవాన్‌బాబావారి దివ్యోపన్యాసం)